నాటి ఎన్నిక ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

తొలి జెండా యాదిలో..

- రజతోత్సవ వేళ ఉద్యమ జ్ఞాపకం
- రైతు నాగలి గుర్తుతో నాటి స్థానిక పోరులో విజయకేతనం
- బ్యానర్‌ను పునరావిష్కరించి.. అభినందించిన అధినేత కేసీఆర్

హనుమకొండ, మార్చి 17: టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం 27 ఏప్రిల్ 2001లో జరిగింది. ఆవిర్భవించిన రెండు నెలల్లోనే ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా ఉద్యమసారథి కేసీఆర్ దార్శనికతతో స్థాపించిన టీఆర్ఎస్ పార్టీ జనం తీర్పు కోసం అధినేత నిర్ణయంతో ఎన్నికలకు వెళ్లింది. అధినేత నిర్ణయం మేరకు 2001 జూలై 3న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాటి టీఆర్ఎస్ అభ్యర్థులను పోటీలో నిలిపింది. రైతునాగలి గుర్తుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయగా టీఆర్ఎస్‌కు తెలంగాణ సమాజం బ్రహ్మరథం పట్టింది. ఆ ఎన్నికల్లో 82మంది జడ్పీటీసీలు, వందలాది ఎంపీటీసీలతో జయకేతనం ఎగురవేసింది. ఆ ఎన్నికల్లో నర్సంపేట, నల్లబెల్లి స్థానం నుంచి జడ్పీటీసీగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. కాగా అప్పుడు ఎన్నికల ప్రచారం కోసం బ్రష్‌తో రాయించిన బ్యానర్‌ను సిల్వర్ జూబ్లీ వేడుకల నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి ఆవిష్కరించారు. ఆనాటి ఉద్యమ పంథా, జ్ఞాపకాలను అందరూ గుర్తుచేసుకున్నారు. రజతోత్సవం సందర్భంగా నాటి టీఆర్ఎస్ రైతు నాగలి గులాబీ జెండాతో ఉన్న బ్యానర్‌ను భద్రపరిచి ఉద్యమ సందర్భాన్ని మరోసారి స్మరించుకునేలా చేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి బృందాన్ని అధినేత కేసీఆర్ అభినందించారు. రజతోత్సవ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాజయ్య, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం, పక్కన మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, పెద్ది, కుడా మాజీ చైర్మన్ యాదవరెడ్డి తదితరులు

ఉప ఎన్నిక భయంతోనే సభ

- సీఎం రేవంత్‌రెడ్డివి నీచపు మాటలు
- రాష్ట్రంలో అభివృద్ధి లేని పాలన నడుస్తున్నది
- బీఆర్ఎస్‌కు చేసిన ద్రోహం కడియంను వెంటాడుతుంది
- విలేకరులతో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, పెద్ది

హనుమకొండ, మార్చి 17: రాష్ట్రంలో అభివృద్ధి లేని పాలన కొనసాగుతున్నదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర, సైకో మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నీతి, నిజాయితీ లేని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిన్నటి సభలో ఏమీ తెలియనట్లు ఉన్నాడని.. ఆయన తీరు చూస్తే స్టూడెంట్ ముందు లెక్చరర్ నిల్చున్నట్లుందని ఎద్దేవా చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సమైక్యాంధ్ర సీఎంలు వైఎస్ఆర్, కిరణ్‌కుమార్‌రెడ్డిలాగే స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించిన సభ సందర్భంగా గ్రామాలను పోలీసులతో నిర్బంధించారని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకోవడంతో పాటు హౌస్ అరెస్ట్ చేశారన్నారు. ఉప ఎన్నికలు వస్తాయనే భయంతోనే స్టేషన్‌ఘన్‌పూర్‌లో సభ ఏర్పాటు చేశారన్నారు. మూలన కూర్చున్న కడియంను కేసీఆర్ పిలిచి పదవులిస్తే బీఆర్ఎస్‌కు ద్రోహం, మోసం చేశాడని, అవి ఆయనను వెంటాడుతాయన్నారు. అభివృద్ధి జరగలేదన్న కడియం శ్రీహరి ఉమ్మడి రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్నది నీవు కాదా? అని ప్రశ్నించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలిచేది బీఆర్ఎస్ అభ్యర్థి తాటికొండ రాజయ్యనేనని స్పష్టం చేశారు. కడియం శ్రీహరికి నమ్మకముంటే రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలవాలని సవాల్ విసిరారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పూర్తిచేసి ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఎయిర్ పోర్ట్, గిరిజన విశ్వవిద్యాలయం కోసం కొట్లాడింది కేసీఆర్, బీఆర్ఎస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, సరైన సమయంలో బుద్ధి చెప్పేందుకు వారు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మైనార్టీ నాయకుడు నయీముద్దీన్, నాయకులు జానకి రాములు, రమేశ్, రామ్మూర్తి, వెంకన్న పాల్గొన్నారు.

విధ్వంసానికి సూచిక రేవంత్‌రెడ్డి

గాడ్నే వారసుడు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ విధ్వంసానికి సూచిక. తెలంగాణ హంతకుడు. ఆదివారం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి కేసీఆర్, ఆయన కుటుంబంపై అసభ్యకరంగా మాట్లాడారు. మాకు ఓపిక నశించింది. ఇకపై రేవంత్‌రెడ్డి తీరులోనే మా సమాధానం ఉంటుంది. కేసీఆర్ తెలంగాణ సాధకుడు. పదేండ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిపై మార్చురీ అంటూ మాట్లాడాడు. రానున్న రోజుల్లో రేవంత్‌కు మార్చురీ తప్పదు. అధికారిక వేదికపై రాజకీయాలు మాట్లాడాడు. రేవంత్‌రెడ్డి అయ్య సొమ్ము కాదు.. కడియం శ్రీహరి సొత్తు కాదు.. అది ప్రజల సొమ్ము. కేసీఆర్ నిజంగా తెలంగాణ జాతిపితే. సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ తక్కువ మాట్లాడితే నాలుక తిరగకుండా బీఆర్ఎస్ చేస్తుంది. రేవంత్ రెడ్డి భాషతో తెలంగాణ రాజకీయాల్లో ఏం మార్పు తీసుకొస్తున్నాడు? ప్రజలకు ఏం చెప్పాలనుకుంటున్నాడు? బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన కడియం కోసం పోయిండు అంటే రేవంత్ ఎటువంటివాడో, ఎవరికి కొమ్ముకాస్తున్నాడో అర్థమవుతున్నది. నేడు కాంగ్రెస్ హయాంలో విధ్వంసం, దోపిడీ, అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడితే అందులో కడియం శ్రీహరి వాటా ఎంత? ప్రజల్లో ఉండాలి తప్ప చిల్లర మాటలు మాట్లాడొద్దు.

– మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

ప్రజాపాలన సభ అట్టర్ ఫ్లాప్

ముఖ్యమంత్రి పాల్గొన్న ప్రజాపాలన సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. తిట్లకు సీఎం రేవంత్‌రెడ్డి జాతిపిత. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే 1.62 లక్షల కోట్లు అప్పు చేస్తే, బీఆర్ఎస్ హయాంలో రూ. 4,17,496 కోట్లు అప్పు చేసిందని, ఆస్తులు, వనరులు సమకూర్చి దేశానికి ఆదర్శవంతమైన పథకాలను కేసీఆర్ ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ చేసిన అప్పుల్లో కొంత ఢిల్లీకి, రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి తెలంగాణ సాధించి నాలుగు కోట్ల మంది ప్రజల గుండెల్లో నిలిచారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే వ్యక్తి కడియం శ్రీహరి. అన్ని పదవులు అనుభవించి బిడ్డకు టికెట్ ఇచ్చినా పార్టీని మోసం చేశాడు. కడియం అవినీతిపై మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం సస్యశ్యామలమైంది. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తే.. ఏడారిలా మార్చింది కడియం కాదా? ఒకప్పుడు రేవంత్‌రెడ్డే కడియం శ్రీహరి కులంపై మాట్లాడుతూ శీల పరీక్ష చేయించుకోవాలని అన్నాడు. అదే రేవంత్ పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టి చంపాలన్నాడు. ఇదే శ్రీహరి కాంగ్రెస్ సర్కారు 6 నెలల్లో కూలిపోతుందని అన్నాడు. సీఎం రేవంత్‌రెడ్డి, కడియం శ్రీహరివి భిన్న వ్యక్తిత్వాలు. వారిది అపవిత్ర కలయిక. పార్టీ మారిన నేతతందరూ సైలెంట్‌గా ఉంటే కడియం మాత్రం ఎక్కువ తక్కువ మాట్లాడుతున్నాడు. ఆయనకు కర్రుకాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధపడుతున్నారు.

– తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే

ఇప్పుడేం చేద్దాం?

హడావుడి పనులు..

భద్రకాళీ చెరువు 382 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. చెరువు మొత్తాన్ని సాగునీటి శాఖ అధికారులు ఐదు బ్లాకులుగా విభజించారు. మొదటి మూడు బ్లాకుల్లోని 6.50 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక మట్టి తవ్వకాల కోసం టెండర్లు పిలిచారు. మొదట్లో క్యూబిక్ మీటరు మట్టికి రూ. 250 చొప్పున ధర నిర్ణయించగా, స్పందన లేకపోవడంతో రూ.162.56కు తగ్గించి టెండర్లు పిలిచారు. మట్టి తవ్వకాలతో రూ.9.50 కోట్లు ఆదాయం వస్తుందని సాగునీటి శాఖ అధికారులు అంచనా వేసినప్పటికీ అవి తలకిందులయ్యాయి. రెండుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో తాజాగా క్యూబిక్ మీటర్ మట్టి తవ్వుకునేందుకు రూ. 71గా నిర్ణయించారు. దీంతో 1.41 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వుకునేందుకు కొందరు ముందుకు రాగా, పనులు ప్రారంభమయ్యాయి. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వ తీరు, సాగునీటి శాఖ అధికారుల ప్రణాళికా లోపమే భద్రకాళీ చెరువు పనులకు శాపంగా మారాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నీళ్లు వదలక ముందు నిండుగా ఉన్న భద్రకాళీ చెరువు(ఫైల్)

నాలుగు నెలలుగా..

సర్కారు ఆదేశాల మేరకు సాగునీటి శాఖ అధికారులు గత ఏడాది నవంబరు 8న చెరువును మొత్తం ఖాళీ చేశారు. 20 రోజుల్లో చెరువులోని నీళ్లన్నీ దిగువన ఉన్న నాగారం చెరువులోకి వెళ్లాయి. ఇది పూర్తయి నాలుగు నెలలైనా అభివృద్ధి పనులు మాత్రం ఇంకా మొదలుకాలేదు. ఎప్పటికి ప్రారంభమవుతాయనే విషయంలోనూ స్పష్టత లేదు. భద్రకాళీ చెరువులోని నీళ్లు ఖాళీ చేయడంతో దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఎండల తీవ్రతకు నీటి కొరత మొదలవుతున్నది. భద్రకాళీ చెరువులో నీటిని కిందికి వదలడంతో చేపల వృత్తిపై ఆధారపడిన మత్స్యకారుల కుటుంబాలు నష్టపోయాయి. వానకాలంలోపు చెరువును నింపకపోతే వచ్చే ఏడాది చేపల పెంపకం ఉండక మరో ఏడాది కూడా నష్టపోవాల్సి వస్తుందని ఆ కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నీళ్లు కిందికి వదిలివేయడంతో ఖాళీగా ఉన్న భద్రకాళీ చెరువు

పూడికతీత పూర్తికాలేదు.. సుందరీకరణ మొదలుకాలేదు

- నాలుగు నెలలుగా దిక్కులు చూస్తున్న అధికారులు
- చెరువు మొత్తం 18 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి
- మూడుసార్లు టెండర్లు పిలిచినా స్పందన కరువు
- తాజాగా 1.41 లక్షల క్యూ.మీ. తవ్వుకునేందుకు ఒప్పందం
- మిగిలిన 93 శాతం పూడికతీతపై అనుమానాలు
- వానకాలంలోపు పనులు పూర్తవడంపై సందేహాలు
- కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల పనితీరుపై విమర్శలు
- బయటపడుతున్న అధికారుల ప్రణాళికా లోపాలు

అధికారుల ప్రణాళికా లోపం.. ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం భద్రకాళీ చెరువుకు శాపంగా మారింది. సుందరీకరణ పేరిట నీళ్లు ఖాళీ చేసి నాలుగు నెలలైంది. పూడికతీతకు మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువైంది. తాజాగా 1.41 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వుకునేందుకు ఒప్పందం కుదిరింది. పనులు మొదలైనప్పటికీ మిగిలిన 93 శాతం పూడికతీతపై సందిగ్ధత నెలకొంది. ఏంచేయాలో పాలుపోక అధికారుల్లో అంతర్మథనం మొదలైంది. మరో రెండున్నర నెలల్లో వానకాలం ప్రారంభం కానుంది. ఆలోగా పూడికతీతతోపాటు సుందరీకరణ పూర్తి చేయాల్సి ఉంది. హడావుడిగా నీళ్లు బయటకు వదిలిన అధికారులు ఇప్పుడు అంతే వేగంగా పనులు జరగకపోవడంతో దిక్కులు చూస్తున్నారు. గడువులోగా పనులు ఎలా పూర్తి చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

- వరంగల్, మార్చి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

భద్రకాళీ చెరువు అభివృద్ధిపై అంతర్మథనం

చారిత్రక భద్రకాళీ చెరువు అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనలు, వాస్తవ పనులు పరస్పరం విరుద్ధంగా కనిపిస్తున్నాయి. వానకాలంలోపు భద్రకాళీ చెరువు సుందరీకరణ పూర్తవుతుందని రాష్ట్ర సర్కారు ప్రకటించింది. ప్రణాళిక లేమి కారణంగా పనుల పూర్తిపై ఇప్పుడు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వంలోని పెద్దల ఆదేశాల మేరకు భద్రకాళీ చెరువులోని మొత్తం నీటిని కిందికి వదిలిన అధికారులకు ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవడంలేదు. ఇప్పటికిప్పుడు ఏం చేసినా, ఎంత చేసినా వానకాలంలోపు పనులు పూర్తయ్యే పరిస్థితి లేదని జిల్లా ఉన్నతాధికారులే అంగీకరిస్తున్నారు. భద్రకాళీ చెరువు పూడికతీతకు స్పందన అంతంతమాత్రంగానే ఉంది. భద్రకాళీ చెరువులో 18 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి ఉన్నట్లుగా సాగునీటి శాఖ అధికారులు నిర్ధారించారు. క్యూబిక్ మీటర్ మట్టికి మొదట్లో రూ. 162 చొప్పున ధర నిర్ణయించారు. మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. చివరికి క్యూబిక్ మీటరుకు రూ. 71 చొప్పున చెల్లించి ఇష్టం వచ్చిన వారు మట్టి తీసుకుపోవచ్చని ప్రకటించారు. అధికారుల బలవంతం మీద 1.41 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తీసుకునేందుకు కొందరు ముందుకు వచ్చారు. ఈ మేరకు సాగునీటి శాఖకు డీడీలు చెల్లించారు. చెరువులోని మిగిలిన మట్టి తరలింపు ఎలా అనేది స్పష్టత రావడంలేదు. మరో రెండున్నర నెలల్లో వానకాలం మొదలుకానుండగా, ఆలోగా పూడికతీత సగం కూడా అయ్యే పరిస్థితి కనిపించడంలేదు.

రేపు దేవాదుల నీటి విడుదల..

- ఎట్టకేలకు ప్రారంభం కానున్న దేవాదుల 3వ ఫేస్ పంపింగ్..
- స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడితో దిగొచ్చిన ప్రభుత్వం
- అన్ని పంపులు, మోటర్లు ఆన్ చేసి రిజర్వాయర్లు, చెరువులు నింపాలి
- నష్టపోయిన పంటకు పరిహారం ఇవ్వాలి లేకుంటే రైతులతో నిరసన కార్యక్రమాలు: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : ఎట్టకేలకు దేవాదుల 3వ ఫేస్ పంపింగ్ బుధవారం ప్రారంభం కానున్నది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెచ్చిన ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం నీటి విడుదలకు ఆదేశించింది. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా తపాస్‌పల్లి, గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, వెల్దండ, లద్నూర్ రిజర్వాయర్లను నింపి జనగామ నియోజకవర్గంలోని ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాల్సింది ఉంది. అయితే, సీజన్ ప్రారంభమై వరినాట్లు అయిపోయాయి. అదనులో నీళ్ల కోసం రైతుల తండ్లాడుతుంటే.., పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడంతో దేవాదుల నీటి విడుదల కోసం ఎమ్మెల్యే పల్లా పలుమార్లు అధికారులను నిలదీశారు. తాను ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడితోనే దేవన్నపేట నుంచి ధర్మసాగర్‌కు వచ్చే థర్డ్ ఫేస్ పంపింగ్‌కు ఈనెల 19(బుధవారం) రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మోటర్లను ఆన్ చేయనున్నారని సోమవారం రాత్రి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. 60 రోజుల్లో కేవలం 40 రోజులు మాత్రమే పంపులు నడపడం శోచనీయమని, 34రోజుల పాటు ఎస్టీఎమ్‌లు సమ్మె చేసినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దీనివల్ల ముఖ్యంగా జనగామ నియోజకవర్గంలోని దేవాదుల ఆయకట్టులో ఉన్న భూములు 50శాతం పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ రైతులు సాగునీటి సమస్యలు చెబుతుంటే గత నెలరోజులుగా ఇరిగేషన్ ఏఈ, డీఈ, ఎస్ఈ, సీఈ, ఈఎన్‌సీ నుంచి నీటిపారుదలశాఖ సెక్రటరీ, మంత్రి దృష్టికి తీసుకెళ్లి నెత్తీనోరు కొట్టుకుంటున్నప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోకపోగా అన్ని పంపులను బంద్ చేశారని పల్లా అన్నారు. చివరికి అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విన్నవించా.. ముఖ్యమంత్రి స్టేషన్‌ఘన్‌పూర్ పర్యటనకు వచ్చిన సందర్భంగా పంపులు ఆన్ చేయాలని వేడుకున్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా 3వ ఫేస్ ఆన్ చేయడంతోపాటు ధర్మసాగర్ నుంచి గండిరామారం వరకు ఉన్న నాలుగు పంపులు ఆన్ చేయాలని, వెంటనే అన్ని పంపులను, మోటర్లను ఆన్ చేసి రిజర్వాయర్లు, చెరువులను నింపి మిగిలిన పంటలను కాపాడాలని, నష్టపోయిన పంటకు పరిహారం ఇవ్వాలని రైతుల తరపున కోరుతున్నా..లేకుంటే రైతులతో నిరసన కార్యక్రమాలను చేపడుతామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.

ట్రైబల్ వర్సిటీ వీసీ బాధ్యతల స్వీకరణ

జిల్లా కలెక్టర్‌తో వీసీ వై.ఎల్. శ్రీనివాస్

ములుగు, మార్చి17 (నమస్తే తెలంగాణ) : సమ్మక్క-సారలమ్మ కేంద్రీయ విశ్వవిద్యాలయం(ఎస్ఎస్‌సీటీయూ) వైస్ చాన్స్‌లర్‌గా ఈ నెల 11న నియమితులైన ప్రొఫెసర్ డాక్టర్ యెడవెల్లి లక్ష్మీశ్రీనివాస్ సోమవారం ములుగు మండలం జాకారం వైటీసీలోని తాత్కాలిక క్యాంపస్‌లో బాధ్యతలు స్వీకరించారు. యూనివర్సిటీ ఓఎస్‌డీ వంశీకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది వీసీని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకరను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తాడ్వాయి మండలం మేడారం గ్రామానికి చేరుకొని శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. యూనివర్సిటీకి పూర్తిస్థాయి వీసీ రావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. వై.ఎల్. శ్రీనివాస్ సారథ్యంలో వర్సిటీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది దేశంలోనే ప్రముఖ విద్యా సంస్థగా ఎదగాలని విద్యావేత్తలు, మేధావులు ఆకాంక్షించారు.

గవర్నర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న నమస్తే ఫొటోగ్రాఫర్ గొట్టె వెంకన్న

నమస్తే సీనియర్ ఫొటోగ్రాఫర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

గవర్నర్ చేతులమీదుగా అందుకున్న గొట్టె వెంకన్న

హనుమకొండ చౌరస్తా, మార్చి 17: నమస్తే తెలంగాణ సీనియర్ ఫొటో జర్నలిస్టు గొట్టె వెంకన్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతులమీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) అనుబంధ తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫొటో జర్నలిస్టులకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో గవర్నర్ ఈ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి గంగాధర్, కె.ఎన్.హరి పాల్గొన్నారు.

'సీతారామ' ద్వారా సాగు నీరందించాలి

మండలిలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇల్లందు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీరు అందించాలని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం మండలిలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ప్రాజెక్టును రూపకల్పన చేశారన్నారు. బయ్యారం పెద్ద చెరువును రిజర్వాయర్ చేస్తూ అక్కడి నుంచి వయా వట్టేరు వాగు ద్వారా పాలేరుకు వెళ్లేలా అంచనా వేశారని, అయితే నియోజకవర్గంలో రిజర్వు ఫారెస్ట్ అత్యధికంగా ఉన్నందున ప్రాజెక్టు డిజైన్‌లో మార్పు చేసి, డోర్నకల్ పాలేరుకు లింక్ చేశారన్నారు. ఇలా చేయడం వల్ల ఇల్లందు, ఖమ్మం రూరల్ మండలానికి నీళ్లు అందుతాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డీపీఆర్ చేశారని, ప్రస్తుత ప్రభుత్వం ఈ డిజైన్‌ను పూర్తిగా పరిగణలోకి తీసుకోలేదని, దీంతో నియోజకవర్గంలో సగం ప్రాంతానికే నీళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. రోళ్లపాడు నుంచి లిఫ్ట్ పెట్టి బయ్యారం పెద్ద చెరువును రిజర్వాయర్ చేసి, బయ్యారం, ఇల్లందు మండలాలకు సాగునీరు అందించాలని, మిగిలితే పాలేరు లింక్ కెనాల్‌కు తరలించాలని కోరారు. ఈ ప్రాజెక్టు డోర్నకల్ మండలం మీదుగా వెళ్తున్నా అక్కడి రైతులు నీటిని వినియోగించుకొనే పరిస్థితి లేదని, నీటిపారుదల శాఖ మంత్రి సమీక్ష నిర్వహించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు శిక్ష

- రూ. లక్ష జరిమానా
- తీర్పు ఇచ్చిన భూపాలపల్లి జడ్జి నారాయణబాబు

రేగొండ, మార్చి 17: అక్రమంగా గంజాయి కలిగి ఉన్నాడన్న నేరం రుజువు కావడంతో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్జి పీ నారాయణబాబు సోమవారం తీర్పు వెలువరించారు. రేగొండ ఎస్సై సందీప్‌కుమార్ కథనం మేరకు.. 2019లో గోరికొత్తపల్లి మండలం నిజాంపల్లికి చెందిన వెంగల రాజన్న గంజాయి కలిగి ఉన్నట్లు సమాచారం రావడంతో వారి ఇంట్లో అప్పటి ఎస్సై ఎన్ సదాకర్ సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 కిలోల ఎండు గంజాయిని గుర్తించి దానిని స్వాధీనం చేసుకొని, రాజన్నను అరెస్ట్ చేయగా అప్పటి చిట్యాల సీఐ పులి వెంకట్ చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కేసు వాదించగా నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

పోక్సో కేసులో భార్యాభర్తలకు ఏడాది..

గణపురం, మార్చి17: మైనర్ బాలికను వేధించిన కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రూ.6వేల జరిమానా విధిస్తూ భూపాలపల్లి ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణబాబు తీర్పునిచ్చారు. ఎస్ఐ రేఖ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండలం చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధి దుబ్బపల్లికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన మోతె రవీందర్ 2020 సంవత్సరంలో వేధించేవాడు. ఈ విషయం బాలిక తన తల్లిదండ్రులకు చెప్పగా పెద్ద మనుసుల వద్దకు పిలిచినా అతడు రాకుండా తన భార్య సునీతను పంపి బాలికను, ఆమె తల్లిదండ్రులను దుర్భాషలాడి కొట్టడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌హెచ్‌వో ప్రభాకర్ ఈ విషయమై పోక్సో కేసు నమోదు చేయగా అప్పటి ఎస్సై సత్యనారాయణ రాజు నిందితులపై సరైన సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పోక్సో కోర్టు స్పెషల్ పీపీ ఎన్ విష్ణువర్ధన్‌రావు వాదనలు వినిపించగా సీఐ మల్లేశ్, ఎస్సై ఆర్ అశోక్ ఆధ్వర్యంలో కోర్టు లైజనింగ్ ఆఫీసర్